## క్లుప్తంగా

### నొస్సంలో వర్షం కోసం పూజలు



బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

**సంజామల:** మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వర్షం కోసం గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుంకలమ్మ దేవాలయంలో అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కుకున్నారు. అమ్మవారికి రైతులు, మహిళలు కూరగాయల అలంకరణ చేసి పూజలు చేశారు.

### గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సభ్యులు

**కోవెలకుంట్ల:** గుర్రం జాషువా సేవలు చిరస్మరణీయమని రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి అన్నారు. జాషువా 54వ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక పరంధామ నిలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేద కుటుంబంలో జన్మించి అనేక అవమానాలు ఎదుర్కొని అంచెలంచెలుగా ఎదిగారన్నారు. గబ్బిలం, పిరదౌసి, కందాసీకుడు, ముంతాజ్ మహల్ వంటి ఖండ కావ్యాలను రచించారన్నారు. కవికోకిల, నవయుగ కవిచక్రవర్తిగా బిరుదులు, పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. ప్రకృతిపీఠం సభ్యులు ఏరాసి మహేశ్వరరెడ్డి, శివ, బాబు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన

**కోవెలకుంట్ల:** మండలంలోని భీమునిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శక్తి టీం ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. 112, పోక్సో యాక్ట్, సైబర్ నేరాలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 1930 గురించి విద్యార్థులకు తెలియజేశారు. అపరిచిత వ్యక్తులు ఫోన్, వాట్సాప్‌కాల్ ద్వారా వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా, ఆధార్, ఓటీపీ, తదితర వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు. కార్యక్రమంలో శక్తిటీం ఏఎస్ఐ నాగరాజు, మహిళా కానిస్టేబుల్ శంకరమ్మ పాల్గొన్నారు.


### పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ

**ప్యాపిలి:** పదోన్నతిపై బదిలీ అయిన ఉపాధ్యాయులకు మెట్టుపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ వెంకటేశ్ నాయక్ మాట్లాడారు. పదోన్నతులు, బదిలీలు ఉద్యోగుల జీవితాల్లో సాధారణమే అన్నారు. ఉపాధ్యాయులు తాము పని చేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచికంచారు. అనంతరం పదోన్నతిపై బదిలీ అయిన చిన్నపరెడ్డి, రవీంద్ర గుప్త, రమాదేవిలను సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకట్‌నాయక్, హాజీ మస్తాన్‌వలి, శివ, ఎమ్మార్సీ సిబ్బంది మద్దయ్య, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### మొక్కలే మనుగడకు ఆధారం



మొక్కలను నాటుతున్న వైద్యురాలు

**డోన్ టౌన్:** భూమిపై జీవుల అన్నింటికీ చెట్లు ఆధారమని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యురాలు రమ్యశిల్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో స్ఫూర్తి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఆకస్మిక వర్షాలు, ఉష్ణోగ్రత పెరుగుదల వంటి సమస్యలకు చెట్లే పరిష్కారమని వివరించారు. కార్యక్రమానికి మొక్కలు అందించిన మెహతాజ్ షోరూం జహంగీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టీచర్ రంగనాథ్, రాజు యాదవ్, స్ఫూర్తి సభ్యులు మధు, భాస్కర్, చంద్ర, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతున్న పథకం!

- అక్కంపల్లె ఎత్తిపోతల పథకంపై నిర్లక్ష్యం
- సాగునీరు అందక రైతుల ఆవేదన
- ఎండుతున్న పంటలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



అక్కంపల్లె గ్రామం కోసం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం



ఎండుతున్న మొక్కజొన్న పంట

**సంజామల:** కూటమి ప్రభుత్వంలో రైతులు విలవిలలాడుతున్నారు. అండగా ఉండాల్సిన ప్రభుత్వం అన్నదాతలను పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులు ఎలాంటి ఇబ్బంది లేక ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు పండించుకునే వారు. ప్రస్తుతం సాగు చేసుకుందామంటే నీరు రాక బోర్లు పారక పంట ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. కుందూనదిలో నీరు పారుతున్నా ఎత్తిపోయలేని పరిస్థితిలో ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉంది. సంజామల మండలం అక్కంపల్లె గ్రామ రైతుల కోసం 2013లో రూ.26 కోట్లతో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. 2014–15లో బీసీ జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. గత ఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు సాగునీరు అందించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తిపోతల పథకం నిర్వహణను గాలికి వదిలేసింది. సాగునీరు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. గ్రామంలో బోర్లు, బావుల కింద పంటలు వేసుకున్న రైతులు అటు వర్షాలు లేక ఇటు ఎత్తిపోతల పథకం కింద నీరు అందక ఆందోళన చెందుతున్నారు.

**2700 ఎకరాలకు సాగునీరు లక్ష్యం**

అక్కంపల్లె ఎత్తిపోతల పథకం దాదాపు 2700 ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత రైతులు పత్తి, మొక్కజొన్న, వరి, మిరప, జొన్న తదితర పంటలు అధికంగా వేస్తారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలను నమ్ముకుని రైతులు పత్తి, మొక్కజొన్న, మినుము తదితర పంటలు బోరుబావుల కింద వేశారు. ఖరీఫ్ సీజన్ ముందు వర్షాలు రైతుల్లో ఆశలు నింపినా ఆ తర్వాత ముఖం చాటేయడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఎత్తిపోతల పథకం కింద ఇప్పటి వరకు సాగునీటిని విడుదల చేయలేదు. ఆయకట్టుకు సాగునీరు అందిస్తారని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

**బోర్లు అడుగంటిన పరిస్థితి**

ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలపై నమ్మకం పెట్టుకున్న రైతులు బోరు బావుల కింద పంటలు వేశారు. కానీ వర్షాలు కురవక, ప్రస్తుతం బోర్లలో నీరు అడుగంటిపోయింది. గ్రామంలో ఉన్న దాదాపు 100 బోర్లలో 60 బోర్లు ఎండిపోయాయని రైతులు చెబుతున్నారు. బోర్ల నుంచి గతంలో రోజుకు 3 ఎకరాలకైనా నీరు సరఫరా అవుతుండగా, ఇప్పుడు ఒక్క ఎకరాకైనా నీరు రావడం లేదని వాపోతున్నారు.

### ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి



నేను 4 ఎకరాల్లో మినుము పంట వేశాను. కుందూ నదిలో వరద నీరు పుష్కలంగా పారుతున్నా రైతులకు అందని పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యంతో ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించలేకపోతున్నారు. ఉన్నతాధికారులు రైతుల బాధలను అర్థం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలి.

–శంకర్ రెడ్డి, అక్కంపల్లె

### పథకం నిర్వహణ గాలికొదిలేశారు



అధికారులు కనీస సమాచారం అందించరు. నీరు వస్తాయో రావో అర్థం కావడం లేదు. ప్రభుత్వానికి రైతుల సమస్యలు అర్థం కావు. మంత్రి నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నేను 4 ఎకరాల్లో పత్తి వేశాను. బోర్ల ద్వారా రోజుకు 3 ఎకరాలు పారేవి. కానీ భూగర్భజలాలు తగ్గడంతో రోజుకు ఎకరా కూడా పారని పరిస్థితి నెలకొంది. –నాగిరెడ్డి, రైతు, అక్కంపల్లె

### నీరు వస్తాయో రావో తెలియదు



గత ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎత్తిపోతల పథకం కింద పంటలు పండించుకున్నాం. గత సవంత్సరం సరైన సమయంలో నీరు అందలేదు. ఈ ఏడాది నీరు వస్తాయో రావో అర్థం కాని పరిస్థితి. నేను 5 ఎకరాలు పత్తి సాగు చేశాను. ఈ ఏడాదిలో వర్షాల కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాలని కోరుతున్నాం.

–కొప్పెట వెంకటేశ్వర్ రెడ్డి, పత్తి రైతు, అక్కంపల్లె

### బోర్లు ఎండిపోతున్నాయి



ఈ ఏడాది ముందస్తు వర్షాలను నమ్ముకుని 3 ఎకరాల్లో పత్తి సాగు చేశాం. కానీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 50 రోజులు అవుతున్నా సరైన వానలు లేకపోవడంతో బోర్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఎత్తిపోతల పథకం ద్వారా అక్కంపల్లెకు నీరు వదిలితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుంది. లేకుంటే వచ్చే నీరు అయినా పత్తి సాగుకు వాడుకుంటాం. అధికారులు స్పందించి నీటి విడుదల చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

–దుగ్గిరెడ్డి చెంచిరెడ్డి, రైతు, అక్కంపల్లె

# ఆదాయ పన్ను చెల్లించడం బాధ్యత




మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి

**కోవెలకుంట్ల:** వివిధ రంగాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల ద్వారా సంపాదిస్తున్న వ్యక్తులు ఆదాయ పన్ను చెల్లించడం బాధ్యతగా భావించాలని వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఆదాయ పన్ను దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదాయ పన్నుశాఖ విధించిన స్లాబ్ ప్రకారం ఆదాయ పన్ను విధిగా చెల్లించాలన్నారు. మనం చెల్లించే ఆదాయ పన్నుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, నరేంద్రనాథరెడ్డి, సుభాష్‌రెడ్డి, లక్ష్మిదేవి, అన్నపూర్ణ, కృష్ణశశాంక పాల్గొన్నారు.

# కాలనీ రహదారి మూసివేత



రహదారికి అడ్డంగా వేసిన బండ రాళ్లు

**బేతంచెర్ల:** మండలంలోని అంబాపురం గ్రామంలో జగనన్న లేఔట్ కాలనీకి వెళ్లే రహదారిలో ఎవరూ వెళ్లకుండా ఓ రైతు అడ్డుకోవడంతో వారం రోజులుగా కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారిలో రెండు చోట్ల కంపలు, బండరాళ్లతో అడ్డుపెట్టాడు. గ్రామంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 116 మందికి ఇళ్ల స్థలాలు మంజూరవగా, అందులో 40 మంది ఇళ్లు నిర్మించుకుని కాలనీలో నివసిస్తున్నారు. ఈ రహదారి వెంట గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, ఆరోగ్య కేంద్రం వంటి ప్రభుత్వ భవనాలు ఉండగా, వాటి తరువాత లేఔట్ కాలనీ ఉంది. రహదారి కోసం తనకు చెందిన ఐదు సెంట్ల భూమిని గ్రామ రైతు స్వచ్ఛందంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రతిగా ఆయనకు 11 సెంట్ల ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు అధికారులు వాగ్దానం చేసినప్పటికీ, స్థలాన్ని చూపించి ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ఆయన నిరసనకు దిగారు. అధికారులపై ఆగ్రహంతో రహదారిని మూసివేశాడు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని, రహదారిని పునరుద్ధరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# తాగు నీటి సమస్య పరిష్కారం




ముదిగేడు ఎస్సీ కాలనీలో నీటి సరఫరాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**సంజామల:** మండలంలోని ముదిగేడు గ్రామంలో ఏడాది కాలంగా తాగునీటి కోసం ఎదురుచూస్తున్న ఎస్సీ కాలనీ వాసులకు శుక్రవారం ఊరట లభించింది. ×ముదిగేడు గొంతెండుతోంది×× అనే శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో సమస్యను ప్రచురించగా, అధికార యంత్రాంగం స్పందించింది. విషయాన్ని గమనించిన ఎంపీడీఓ సాల్మన్ నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మిని ఆదేశించారు. పైపులైన్ మరమ్మతులు చేసి, కాలనీలో తాగునీటి సరఫరా ప్రారంభించారు. దాదాపు సంవత్సరం తర్వాత కొళాయిల్లో నీరు రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను వెలుగులోకి తీసుకొచ్చిన సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

**డోన్ టౌన్:** విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డోన్ డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. శక్తి టీం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా రోడ్ భద్రత, ప్రమాద నివారణ, సైబర్ క్రైమ్, మహిళా రక్షణ, శక్తి యాప్ ఉపయోగాలపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ వయస్సులో చెడు అలవాట్లకు బానిస కాకూడదని సూచించారు. మత్తుపదార్థాలు, ఆన్‌లైన్ మోసాలు, నకిలీ రుణ యాప్‌ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలతో గౌరవంగా ప్రవర్తించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ×శక్తి యాప్× ద్వారా వాట్సాప్ కాల్ లేదా వీడియో కాల్ చేస్తే పోలీసులు వెంటనే స్పందిస్తారని తెలిపారు. సైబర్ నేరాలకు 1930, అత్యవసరాలకు 100, బాల్యవివాహాల నివారణకు 112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అధ్యాపకులు, ఎస్ఐ మమత, శక్తి టీం సభ్యురాలు లక్ష్మి పాల్గొన్నారు. అలాగే చిన్న మల్కాపురం జెడ్పీ హైస్కూల్‌లో రూరల్ సీఐ రాకేష్ విద్యార్థులకు మత్తుపదార్థాలు, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

**రేపటి నుంచి క్రీడా పోటీలు**

**బేతంచెర్ల:** పట్టణంలోని సరస్వతీ శిశు మందిరం ఉన్నత పాఠశాలలో ఈనెల 26, 27 తేదీల్లో కర్నూలు, నంద్యాల జిల్లా స్థాయి ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల కమిటీ సభ్యులు మారుతి కృష్ణ, గౌరి హుసేన్ రెడ్డి, గోపాల్, మధు మోహన్ రెడ్డి, మద్దిలేటి స్వామి తెలిపారు. సుమారు 400 మంది క్రీడాకారులు పోటీలకు హాజరవుతారని చెప్పారు. రోటరీ క్లబ్‌తోపాటు గౌరి హుసేన్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

## భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



పల్లకీతో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

**డోన్ టౌన్:** పట్టణ శివారులోని కొండపై వెలసిన తిరుమల వీరాంజనేయ స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తుల రద్దీ కనిపించింది. వేకువజాము నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, సాయంత్రం పల్లకిపై స్వామివారిని ఊరేగించి గిరి ప్రదక్షిణ చేశారు. వందలాది మంది భక్తులు హనుమాన్ చాలీసాను 11 సార్లు పఠించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అలాగే మండలంలోని గుమ్మకొండ సమీపంలోని బంగారుకొండ పాతపాలెంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతులు నిర్వహించారు. సింధూరతిలకం, తమలపాకుల తోరణాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

# ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఒక సైనికుడే





వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, హాజరైన సోషల్ మీడియా కార్యకర్తలు

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- కూటమి అక్రమాలను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపు

**బనగానపల్లె:** ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఒక సోషల్‌మీడియా సైనికుడిగా పనిచేయాలని, పచ్చ మీడియాను ఎదుర్కొనే దిశగా దూకుడు చూపించాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని తన స్వగృహంలో జరిగిన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ సోషల్‌మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన హామీలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గ్రామాల్లోని ఏ చిన్న సమస్యైనా సోషల్‌మీడియా వేదికగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కూటమి ప్రభుత్వం అక్రమ కేసులతో బెదిరింపులకు పాల్పడుతున్నప్పటికీ, కార్యకర్తలు ధైర్యంగా నిలబడి, పార్టీ విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల అనంతరం వైఎస్ జగన్ 2.0 పరిపాలనను ప్రజలు చూసే అవకాశం వస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని, ప్రతి సోషల్‌మీడియా కార్యకర్తకు తన పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సోషల్‌మీడియా జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రరెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తార్ జాహెద్‌హుస్సేన్, పార్టీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం, సోషల్‌మీడియా అధ్యక్షుడు చంద్రమౌళి, బనగానపల్లె, అవుకు మండలాల సోషల్ మీడియా అధ్యక్షులు సాదక్‌హుస్సేన్, ప్రమోద్‌గౌడ్, కాంతారెడ్డి, రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

**బేతంచెర్ల:** మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు తెలిపారు. ప్రతి రోజు స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆలయ ఆవరణలో హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు. శ్రావణ మాసం శ్రీ మహావిష్ణువుకు ప్రీతికరమైన మాసం అని.. స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయని తెలిపారు. ఆగస్టు 8వ తేదీ సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తామన్నారు.

## సర్వేయర్లకు వీడ్కోలు



సర్వేయర్లను సత్కరించిన సిబ్బంది

**డోన్ టౌన్:** మండలంలోని గ్రామ సచివాలయాల్లో సర్వేయర్లుగా విధులు నిర్వహించి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన సిబ్బందిని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజల సేవలో నిస్వార్థంగా పని చేసినవారిని సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల మన్ననే నిజమైన గుర్తింపని పేర్కొన్నారు. సన్మానం పొందిన వారిలో దొరపల్లె సచివాలయం సర్వేయర్ దాదా ఫక్రుద్దీన్, వెంకటాపురం ఉదయ్ కిరణ్, గుమ్మకొండ అజయ్‌కుమార్‌తో పాటు మహేష్, శ్రీనివాసులు, హరికృష్ణ, సూర్య, కల్యాణ్, గంగాధర్, దిలీఫ్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజా, ఆర్ఐ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలు



కోవెలకుంట్ల: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కోటపాడులో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**కోవెలకుంట్ల:** బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేట, మండలంలోని జోళదరాశి, భీమునిపాడు గ్రామాల్లోని చౌడేశ్వరీ ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

- **కొలిమిగుండ్ల:** తొగటవీర క్షత్రియుల ఇష్టదైవమైన చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కోటపాడులోని ఆలయంలో తెల్లవారుజామునే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గ్రామపెద్దల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. భజన కార్యక్రమాలు జరిగాయి. కొలిమిగుండ్ల ప్రధాన రహదారి వద్ద నున్న చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**విశేష పూజలు**

**బేతంచెర్ల:** స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, కుంకుమార్చన చేసి మహామంగళహారతులు ఇచ్చారు. ఆయా కాలనీలకు చెందిన మహిళలు అమ్మవారి ఉత్సవమూర్తితో ఊరేగింపుగా డప్పువాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని చీర, సారె సమర్పించారు. హెచ్.కొట్టాల గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి, బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మకు విశేష పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని గ్రామవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు గౌరి హుసేన్‌రెడ్డి, రఘురామిరెడ్డి, సుబ్బారెడ్డి, రామస్వామి, గూని నాగరాజు, మద్దయ్య, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్ల: అలంకరణలో చౌడేశ్వరీదేవి,



అమ్మవారిని సారె తీసుకెళ్తున్న భక్తులు

# ‘మూగ’ మిత్రులు



కోతులకు పండ్లు తీసుకెళ్తున్న రామ సుబ్బడు





దాతలతో కలిసి వానరాలకు పండ్లు పెడుతున్న భజన కృష్ణయ్య

**బేతంచెర్ల:** అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న మూగ జీవాలకు రెండు దశాబ్దాలుగా ఆహారం, నీరు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు ఇద్దరు సేవకులు. బేతంచెర్లకు చెందిన లారీ డ్రైవర్ రామ సుబ్బడు ఆంజనేయ స్వామి భక్తుడు. 20 ఏళ్ల క్రితం తాడిపత్రి నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా గోర్లగుట్ట మలుపులో ముందు వెళ్తున్న ట్రాక్టర్ నుంచి నీటి డబ్బా పడిపోయింది. అక్కడున్న వానరాలు ఆ తేమను నాకుతుండడం ఆయన హృదయాన్ని కదిలించింది. అప్పటి నుంచి అక్కడి వానరాలకు సిమెంట్ తొట్లు ఏర్పాటు చేసి ప్రతి రోజు నీరు, పండ్లు, దుంపలు వంటివి అందిస్తున్నారు. రామ సుబ్బడును అనుసరించి పలువురు ప్రయాణికులు కూడా ఆహారం పెట్టే ధోరణిని అనుసరిస్తున్నారు. ఇక భజన కృష్ణయ్య తన సేవలను ఐదేళ్లుగా కొనసాగిస్తున్నారు. ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయం పరిసర అటవీ ప్రాంతంలో మూగ జీవాల పరిస్థితి చూసిన ఆయన, పట్టణంలోని దాతల సహకారంతో రోజూ పండ్లు, దుంపలు తీసుకెళ్లి ఆహారం అందిస్తున్నారు. వీరి సేవలను గుర్తించిన రోటరీ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించింది.